క్లుప్తంగా

అలరించిన హరికథ

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో బుధవారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కథకులు రేపల్లె శ్రీనివాసులు బృందం సీతా కల్యాణాన్ని గానం చేశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిల్పారామం పాలనాధికారి ఎస్.కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పెంచిన ఎల్పీజీ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.50 మేర పెంచడం వల్ల సామాన్య వినియోగదారులపై భారం పడుతుందన్నారు.

పేదలపై భారం మోపడం తగదు



మాట్లాడుతున్న అంకన్న

కడప ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజలపై భారం మోపుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు సతమతమవుతున్న పరిస్థితులలో వంట గ్యాస్ ధర, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై మరింత భారం మోపడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం పనులు లేక పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు పరుగులు తీస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఖాదర్ బాష, భాస్కర్, నగర నాయకులు మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య నీరాజనం



నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారిణిలు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శ్రీ రామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి యువ కళాకారిణిలు తమ నృత్యాలచే స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు అర్పించారు. హైదరాబాదుకు చెందిన శ్రీ సాయిదేవ్ కూచిపూడి నాట్య అకాడమి నిర్వాహకులు బసవ లావణ్య బృందం, సభ్యులు పలు శాస్త్రీయ నృత్యాలతో దేవతామూర్తులను అర్చించారు. ఆలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి ఈ సందర్భంగా నృత్య గురువు లావణ్యతోపాటు బృందం సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించి ఆ సామాజిక వర్గానికి తగిన న్యాయం చేయాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె ప్రసాదరావు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ హత్య ఉదంతాన్ని వెలికి తీయాలని, సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పగడాల ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు బయట పెట్టాలని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 14న పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, బిషప్ డేనియల్ కృష్ణదాస్, పాస్టర్ డేవిడ్ రాజ్, పాస్టర్ రాజన్న, పాస్టర్ కిరణ్, పాస్టర్ అమర్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ సుధాకర్ నీతులు చెప్పడం విచిత్రం

కడప కార్పొరేషన్: నిందితులను సాక్షులుగా చేర్చిన ఎస్‌ఐ సుధాకర్ నీతులు చెప్పడం విచిత్రంగా ఉందని ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మెన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లెలో కురబ లింగమయ్యను టీడీపీ నేతలు దారుణంగా హత్య చేస్తే..టీడీపీ నాయకులనే సాక్షులుగా చేర్చి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ ఖాకీ డ్రస్‌కే కళంకం తెచ్చాడన్నారు. ఆయన నీతుల గూర్చి మాట్లాడడం దారుణమన్నారు.

పట్టాభిషేక వేడుక



పట్టాభిషేక వేడుకకు హాజరైన బిషప్‌లు



వేడుకను తిలకిస్తున్న వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విశ్వాసులు



పట్టాభిషేక వేడుకను తిలకించడానికి వచ్చిన సినీనటి వై విజయ



దివ్య ఆశీస్సులు పొందుతున్న బిషప్‌లు

కథోలిక మేత్రాసన నూతన పీఠాధిపతిగా మోస్ట్ రెవరెండ్ సగినాల పాల్‌ప్రకాశ్ పట్టాభిషిక్తులయ్యారు. బుధవారం కడపలో జరిగిన కార్యక్రమాన్ని వీక్షించేందుకు విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గురువులు ప్రత్యేకంగా రూపొందించి అలంకరించిన రథాలలో వాహనాల్లో విశ్వాసులతో కలిసి ఊరేగింపుగా వేదిక వద్దకు వచ్చారు. బిషప్ పట్టాభిషేక ప్రాంగణానికి చేరుకోగానే విశ్వాసులు హర్షధ్వానాలు చేస్తూ హల్లెలూయా నినాదాలతో ఆ ప్రాంతాన్ని ప్రతిధ్వనింపజేశారు. – కడప కల్చరల్



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం



పట్టాభిషేక వేడుకకు హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన బిషప్‌లు

వాచ్‌మెన్ దాడి

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వాచ్‌మెన్ వెంకటేష్‌తోపాటు బంధువులు కలిసి నరసింహ అనే వ్యక్తిపై దాడికి దిగారు. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం స్థానిక బాలికల పాఠశాల వీధిలో ఉన్న వంకదారి నరసింహ పాఠశాల ఆవరణంలో వాకింగ్ చేసేందుకు వెళ్తుండగా వాచ్‌మెన్, బంధువులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వాచ్‌మెన్‌ను మిగతా వారు, వాకింగ్ చేస్తున్న నర్సింహులు ప్రశ్నించగా.. నాకే ఎదురు చెబుతావా అంటూ వా చ్‌మెన్ వెంకటేష్, బంధువులు కలిసి నరసింహ పై దాడి చేశారు. ఈ దాడిలో నరసింహకు రక్తపు గాయాలయ్యాయి. దీంతో అతన్ని స్థాని క ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘ టనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

డ్రైవర్‌కు గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంబకప ల్లె రోడ్డులో ఉన్న పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలు సమీ పంలో బుధవారం కారు, ఆటోలు ఎదురెదురు గా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గాయపడిన ఆటో డ్రైవర్‌ను పులివెందు ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు పుల్లారెడ్డి హాస్పిటల్ వద్ద బుధవారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభాన్ని ఇన్నోవా కారు ఢీకొంది. పట్టణానికి చెందిన హరికృష్ణ అనే డ్రైవర్ తన కారులో స్నేహితులను హైదరాబాద్‌కు వెళ్లే ట్రైన్ ఎక్కించేందుకు ఎర్రగుంట్లకు వెళ్లాడు. స్నేహితులను అక్కడ వదిలి తిరిగి పులివెందులకు వచ్చే సమయంలో పుల్లారెడ్డి ఆసుపత్రి వద్దకు రాగానే విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో విద్యుత్ స్తంభం పూర్తిగా ఒంగిపోయింది.

ఎస్జీటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, గొనిగల హైమారావు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కె.విజయరామరాజుకు వినతి పత్రాన్ని సమర్పించారు. బుధవారం విజయవాడలోని కార్పొరేషన్‌లో ఆయనను కలసి ఈ వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లోని రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలలో ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టులను అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు.

అలాంటి పాఠశాలలో అర్హత ఉండి ప్రమోషన్లులేక అలాగే ఉన్నారన్నారు. అర్హత కలిగిన వారికి పదోన్నతి కల్పించాలని కోరారు. మూడు సంవత్సరాల లోపు ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. బదిలీల నుంచి 40శాతం అంధ ఉపాధ్యాయులకు, 70 శాతం దివ్యాంగులకు మినహాయింపు ఇవ్వాలని కోరినట్లు తెలియజేశారు. 1998, 2008 ఎంటీసీ ఉపాధ్యాయులకు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు, వైవి చిట్టిబాబు, గోవిందు నాగరాజు, కోదండ పాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ కిట్ అందజేస్తాం

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల ప్రారంభోత్సవానికి ముందే ప్రతి విద్యార్థికి కిట్ అందచేస్తామని ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ స్టేట్ అబ్జర్వర్ పివికే ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని కడప, ఒంటిమిట్ట, సిద్దవటం, సికెదిన్నె, చెన్నూరు, ఖాజీపేట మండలాల స్టాక్ పాయింట్లను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభానికి ముందే విద్యార్థులకు కిట్ అందించే లక్ష్యంతో వేసవి సెలవుల్లోనే జిల్లా, మండలం, స్కూల్ పాయింట్‌కు కిట్లు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. స్టాక్ పాయింట్లలో స్టాక్‌ను జాగ్రత్తగా భద్రపరిచే సమయంలో ఎటువంటి ఇబ్బంది జరగకుండా ఉండేందుకు ప్రదేశాలను చూసుకోవాలని ఆదేశించారు. సంబంధిత స్టాక్ పాయింట్లను ఆయా మండలాల్లో జిల్లాస్థాయి అధికారులతో కలిసి పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా కమ్యూనిటి మొబలైజేషన్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి, కడప మండల విద్యాశాఖ అధికారి-2 ఇర్షాద్ అహ్మద్, మండల కమిటీ సభ్యులు దేవసహాయం, సాగర్, కడప ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



కడపలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న స్టేట్ అబ్జర్వర్ పివికే ప్రసాద్

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్: కడపలోని శ్రీ రామకృష్ణ హై స్కూల్, శ్రీ రామకృష్ణ జూనియర్ కళాశాలలో 1965 -2005 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం సికింద్రాబాద్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రకాష్‌రావు, సుజాత, శారద, శాంతలతోపాటు కొంతమంది గురువులు హాజరై పూర్వ విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులను సత్యనారాయణ (బాచు) ఆహ్వానించగా షేక్ షబ్బీర్ హుస్సేన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాల తర్వాత జరిగిన ఈ ప్రత్యేకమైన సమావేశంలో అందరం కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు తమ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. డాక్టర్ జగదీష్ బాబు ఆర్థోపెడిక్ హెల్త్‌కేర్ గురించి వివరించారు. తరువాత పూర్వ విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని ఆటలు, శారీరక శిక్షణ వ్యాయామాలు నిర్వహించారు. అనంతరం గురువులను సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంజీవ రెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, సి.ఎస్.జి. ప్రసాద్, రఘు రామ్‌మూర్తి, శ్రీనివాసరావు, డాక్టర్ కొండారెడ్డి, గోపీనాథ్, సర్వద, షబ్బీర్ హుస్సేన్ లతోపాటు నాగుల సత్యనారాయణ పాల్గొన్నారు.



సికింద్రాబాదులోని తాజ్‌మహల్ హోటల్‌లో కలుసుకున్న కడప నగరంలోని రామకృష్ణ పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థులు

మహిళలు మార్పు కోసం ముందుండాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మహిళలు అన్నింటిలో ముందుండాలని ఉమెన్స్ త్రైవ్ ఏపీ ఫౌండర్ షేక్ రషీదా బేగం పేర్కొన్నారు.బుధవారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఉమెన్స్ త్రైవ్ ఏపీ ఫౌండేషన్ రూపొందించిన ప్రత్యేక పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆర్థిక, ఆరోగ్య, విద్యా అభివృద్ధికి తోడ్పడటం, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడమే మా లక్ష్యం అన్నారు. ఉచిత ఆన్లైన్ కోర్సులు, వైద్య శిబిరాలు, ఆరోగ్య పరిరక్షణ శిబిరాల ద్వారా మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా పనిచేస్తున్నాం అన్నారు. ఉమెన్స్ త్రైవ్ ఏపీ కో-ఫౌండర్ రాధ, డైరెక్టర్లు అశ్విని, ప్రసన్నలక్ష్మి, ఎస్.ఆర్.దేవి, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ గౌస్, సంఘ సేవకులు సలావుద్దీన్, ఇండియన్ యూనియన్ ముస్లిం పార్టీ జిల్లా అధ్యక్షులు అలీ షేర్ న్యామతుల్లా అఖిల రామతున్నిస్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమెన్స్ త్రైవ్ ఏపీ ఫౌండర్ రషీదా బేగం

కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలి

సిద్దవటం : వాహనాలకు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో బుధవారం వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా కల్యాణోత్సవం సందర్భంగా 13 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. కడప - చెన్నై జాతీయ రహదారి ఉప్పరపల్లె పంచాయతీలోని సాయిబాబా గుడి సమీపంలో కారు, బస్సు, ద్విచక్ర తదితర వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రకృతి వ్యవసాయ విధానాలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ తయారీ, ప్రీ మాన్‌సూన్ డై సోయింగ్, విత్తన గుళికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతపరిచేందుకు రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

శాఖల ప్రగతిపై సమీక్ష



ఎంబీఏ విభాగాల అభివృద్ధి గురించి వీసీ, ప్రిన్సిపాల్‌కు వివరిస్తున్న డాక్టర్ సరిత

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శాఖల వారీగా సమీక్షను బుధవారం ప్రారంభించారు. జాతీయ విద్యా విధానం -2020 ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని శాఖల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు స్టడీ చేసేందుకు ఆయన పలు విభాగాలను వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో కలిసి సందర్శించారు. ఏంబీఏ విభాగాధిపతి డా.పి.సరిత, కామర్స్ సహ ఆచార్యులు డా.విజయభారతి, ఎంసీఏ శాఖ సహ ఆచార్యులు డా.రెడ్డయ్యలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి ఉపకులపతి ముందు వివరించారు. శాఖల భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక, లక్ష్యాలను, విజన్ డాక్యుమెంట్ రూపొందించడం గురించి వివరించారు.

సైన్సుపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులతో పాఠశాల చైర్మన్ సయ్యద్ గౌస్‌పీర్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి స్థాయి నుంచే సైన్సుపై విద్యార్థులు అవగాహన పెంచాలని న్యూ పీస్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మెన్ సయ్యద్ గౌస్‌పీర్ పేర్కొన్నారు. కడప కాగితాలపెంటలోని న్యూ పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం సైన్సుఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్‌ను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు దుర్మార్గం

కడప కల్చరల్ : రాయలసీమ ప్రయోజనాలను బలిపెట్టి, 2025 మే 1 నుంచి రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేస్తూ, దాని ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 7 న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని రాయలసీమ ఆకాంక్షల పౌర వేదిక కోఆర్డినేటర్ అలవలపాటి రఘునాథరెడ్డి ఒక పత్రికా ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ వ్యాప్తంగా వివిధ వర్గాలు, తరగతులు పాల్గొన్న ఆందోళనలు కాదని వెలువడ్డ ఈ నోటిఫికేషన్ వెనుక స్పాన్సర్ బ్యాంకుల లాబీయింగ్, రాష్ట్ర ప్రభుత్వం అన్యాయమైన సిఫారసు, కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితమైన నిర్ణయం ఉన్నాయన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మే 1 నుండి రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేస్తూ, దాని ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 7 న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి బి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా, కర్ణాటకలో రెండు గ్రామీణ బ్యాంకులు విలీనం అయ్యాయని, పెద్ద బ్యాంకు అయిన కర్ణాటక గ్రామీణ బ్యాంకు కేంద్రమైన బళ్లారిలో రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. కానీ ఇదే సూత్రాన్ని ఆంధ్రప్రదేశ్ లో ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు.

మట్కా బీటర్లు అరెస్టు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.26,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

సిద్దవటం : మండలంలోని సంటిగారిపల్లె గ్రామంలో రెండు వారాలుగా ఏర్పడిన తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంటిగారిపల్లె గ్రామంలోని ప్రజలు వేసవి కాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామానికి కూత వేటు దూరంలో పెన్నానది ఉన్నా తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. తాగునీటి కోసం మహిళలు రైతుల పొలాల్లోకి వెళ్లి పైప్‌లైన్‌లో కారుతున్న నీటిని బిందెలకు పట్టుకొని తెచ్చుకుంటన్నామన్నారు. అధికారులకు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదని వేదన చెందారు. ఉన్నతాధికారులైనా మా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.